క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. అలాగే శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామికి షష్టిని పురస్కరించుకుని అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు.

మహానందిలో పత్తికొండ ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే శ్రీదేవి, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

మహానంది: పత్తికొండ శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మహానందికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకారం మండపంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా రాము

వెలుగోడు: ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడిగా బచ్చు రాము ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో బచ్చు రాము చేత ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి మహేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే వెలుగోడుకు చెందిన అయోధ్య కర సేవకుడు లాలం జనార్దన్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి మహేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ, లాలం మల్లికార్జున, తాళ్లూరి రవికుమార్, బొగ్గారపు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీ

కొత్తపల్లి: ఎన్నికల సమయం ఆసన్నమవుతుండడంతో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. అందులో భాగంగానే ఎంపీడీఓ మేరి ఇదివరకే అనంతపురం జిల్లాకు బదిలీ కాగా బుధవారం రిలీవ్ అయ్యారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌ను కూడా అనంతపురం జిల్లాకే బదిలీ చేస్తు జిల్లా అధికారుల నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

అంతర పంటలతో లాభాలు

నందికొట్కూరు రూరల్: రైతులు తమ పంట పొలాల్లో అంతర పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఆత్మ బీటీఎం చక్రవర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలాల్లో వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో పురుగు ఉధృతిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, రక్షణ పంటగా జొన్నను సాగు చేయాలని, పొలం గట్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని రైతులకు ఆయన సూచించారు. బీటీఎం వెంట వీఏఏ శాంతిరాజు ఉన్నారు.

అలరించిన సంగీత కచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై మేడ్చల్‌కు చెందిన వి.ఎస్.ఎన్.మూర్తి ద్విభాష్యం, బృందం వారు శాస్త్రీయ సంగీత కచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శంభో మహాదేవ శంకరా, ఓం హరశంకరా, నమశ్శివాయతే, కైలాస గిరి నివాసా, శ్రీశైలవాసా, దయగనవయ్య, శ్రీశైలవాసా తదితర గీతాలను ఆలపించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రహరీ గోడ నిర్మాణంలో తలెత్తిన వివాదాస్పద స్థలాన్ని ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ గురువారం పరిశీలించారు. ఎస్‌ఐ గ్రామానికి చేరుకొని ఆలయ కమిటీ పెద్దలను, అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తి సలాంను పిలిపించి విచారించారు. ఆలయ గోడ నిర్మాణం నుంచి ప్రహరీ నిర్మించేందుకు నాలుగు అడుగుల స్థలాన్ని ఇవ్వాలని గ్రామస్తులు కోరగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పోలీస్ స్టేషన్‌కు సమాచార ఇవ్వండతో స్టేషన్‌కు ఇరువర్గాలను పిలిపించి సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాలతో పాటు ఆత్మకూరు పట్టణంలో ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, నరసింహనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుదర్శన భవనంలో గురువారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సుధాకర్, వెంకటేశ్వర్లు, మాబాషా, శివమ్మ పాల్గొన్నారు.



నాడు అల్లూరు-శాతనకోట రోడ్డు ఇలా..



నేడు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన దృశ్యం

పల్లెల ప్రగతికి దారులు

- నియోజకవర్గంలో వేగంగా రోడ్ల నిర్మాణాలు
- మారిన రహదారుల రూపురేఖలు
- నెరవేరిన 20 ఏళ్ల నాటి పెంచికపల్లి గ్రామ ప్రజల కల
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



నాడు మద్దూరు-పెంచికలపల్లి రోడ్డు దుస్థితి



నేడు మద్దూరు-పెంచికలపల్లి రోడ్డు నిర్మాణ పనులు



నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేస్తోంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా నాణ్యాత ప్రమాణాలను పాటిస్తూ బీటీ రోడ్లు నిర్మిస్తోంది. దాదాపు రూ.40కోట్లతో రోడ్ల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 90 శాతం పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్ల నుంచి ప్రజలు వినతులు ఇస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రమాదాలు జరుగుతున్నా స్పందించలేదు. ప్రస్తుతం పరిస్థితి మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ పట్టింది. గతంలో ప్రతిపాదనలకే పరిమితమైన ఎన్నో అభివృద్ధి పనులు నేడు కార్యరూపం దాల్చుతున్నాయి.

నెరవేరిన 30 ఏళ్ల నాటి శాతనకోట వాసుల కల

శాతనకోట గ్రామ వాసులు ముప్పై ఏళ్లుగా పట్టణానికి ప్రయాణం చేసేందుకు నరకయాతన అనుభవించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గంలో బ్రాహ్మణకొట్కూరు-శాతనకోట రోడ్డు 8 కిలోమీటర్లు నిర్మాణ పనులు రూ. 3 కోట్ల నిధులతో పూర్తయ్యాయి. అలాగే నందికొట్కూరు-అల్లూరు రోడ్డు రూ.70 లక్షలు, కొణిదేల నుంచి పగిడ్యాల రోడ్డు 5 కిలోమీటర్లు రూ.3.70 కోట్లు, పాములపాడు మండలంలో క్రిష్ణారావుపేట-సిద్ధేశ్వరం 11.2 కిలోమీటర్లు రూ. 8.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. బానుముక్కల మలుపు వద్ద నుంచి వేంపెంట గ్రామం వరకు 6 కిలోమీటర్లు రూ.3.23 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. మద్దూరు-పెంచికలపల్లి వరకు బీటీ రోడ్లు జగనన్న ప్రభుత్వంలో పూర్తయ్యాయి.

రూ.5.50 కోట్లతో పారుమంచాల-రోళ్లపాడు రోడ్డు

జూపాడుబంగ్లా మండలంలో బన్నూర్ సమీపంలో కేజీ రోడ్డు 1.5 కిలోమీటర్ల రోడ్డు రూ.80 లక్షలు, పారుమంచాల-రోళ్లపాడు 4.50 కిలోమీరట్ల వరకు రూ.5.50 కోట్లు, పారుమంచాల-తిమ్మాపురం 4.50 కిలోమీటర్ల రోడ్డు రూ.6.50 కోట్లు, పారుమంచాల-మద్దూరు 10 కిలోమీటర్ల రోడ్డు రూ.4.80 కోట్లు, తంగడంచ చెక్‌పోస్టు-పారుమంచాల 7 కిలోమీటర్ల రోడ్డు రూ.1.50 కోట్లు, మిడుతూరు మండలంలోని నంద్యాల రోడ్డు నుంచి చెరుకుచర్ల 4 కిలోమీటర్ల రోడ్డు రూ. 2 కోట్లు, కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం రోడ్డు కిలోమీటర్ రోడ్డు రూ.10 లక్షలు వెచ్చించి బీటీ రోడ్లు పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగనన్నకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు దాదాపు పూర్తి

నంద్యాల జిల్లా పరిధిలోని గుంటూరు ప్రధాన రహదారి నుంచి పారుమంచాల, ఆత్మకూరు-వడ్ల రామాపురం, ఆత్మకూరు-ముష్టపల్లి, వెలుగోడు-వేంపెంట, వాడాల-పాములపాడు, మద్దూరు-పెంచికలపల్లి రోడ్డు కిలో మీటర్ వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. కురుకుంద-కొట్టాలచెరువు రోడ్డు పూర్తికాగా.. సంతజూటూరు- నారపరెడ్డి కుంట రోడ్డు 90 శాతం పూర్తయ్యింది. వేల్పనూర్-అయ్యవారిపల్లె, నంద్యాల-మహనంది రోడ్డు పూర్తయ్యాయి. బోదనం-పెసరవాయి కోటి రూపాయలతో బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

– నాగరాజు, ఆర్ అండ్ బీ సూపరిండెంట్ ఇంజనీరు కర్నూలు

రోడ్డు కష్టాలు తీరాయి



శాతనకోట గ్రామానికి 30 ఏళ్లుగా బీటీ రోడ్డు గుంతలమయంగా ఉండేది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతనంగా బీటీ రోడ్డు వేసి గ్రామ ప్రజల ప్రయాణం కష్టాలు తీర్చారు. 8 కిలో మీటర్ల వరకు గుంతలమయంగా ఉన్న రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉండేది. గర్భవతులు, రోగులు, గుండె జబ్బులు వ్యాధిగ్రస్తులు తీవ్రంగా ఇక్కట్లు పడ్డారు.

– వెంకటేష్ శాతనకోట, నందికొట్కూరు మండలం

గతంలో నరకం అనుభవించాం



పెంచికలపల్లి నుంచి ఎక్కడికి ప్రయాణం చేయాలన్నా నరకం అనుభవించాం. ప్రభుత్వాలు మారినా రోడ్డు రూపురేఖలు మారలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తరలించాలంటే పెద్ద పెద్ద గుంతలను దాటుతూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉండేది. జగనన్న పాలనలో మూడు కిలో మీటర్లకు బీటీ రోడ్డు వేశారు. ప్రయాణం అలుపు లేకుండా చేస్తున్నాం.

– బోనాల నాగలక్ష్మమ్మ, వేంపెంట గ్రామం, పాములపాడు మండలం

నేడు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

నందికొట్కూరు: నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం జరిగే కార్యకర్తల సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అందించిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు రావాలి జగన్...కావాలి జగన్ అంటున్నారన్నారు. చంద్రబాబు అబద్ధాలు, మోసాలు రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ప్రజలుకు మేలు చేసిన జగనన్నకే ఓటు అడిగే హక్కు ఉందని చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే నియోజకవర్గస్థాయి సమావేశానికి కార్యకర్తలు స్వచ్ఛందంగా హాజరుకావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న నారా లోకేష్



లోకేష్ దంపతులకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను బహూకరిస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం శ్రీశైల మల్లన్న దర్శనార్థం శ్రీశైలం విచ్చేసిన నారా లోకేష్ దపంతులు ముందుగా సాక్షిగణపతి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. లోకేష్ వెంట టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులు ఉన్నారు. శ్రీశైలం వచ్చిన నారా లోకేష్ నంద్యాల జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో భ్రమరాంబా అతిథిగృహం వద్ద ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

బెల్లం ఊట ధ్వంసం

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామ శివారులో 200 లీటర్ల ఊట బెల్లం ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు గురువారం ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. నాగలూటి గ్రామానికి చెందిన వడ్డె నాగేంద్ర పోలీసులను చూసి ఘటనా స్థలం నుంచి పరారయ్యాడని చెప్పారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వేల్పనూరు పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యసేవలు

వెలుగోడు: వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇకపై 24 గంటలు వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారులు జహీర్‌వలి, ప్రణీత్ తెలిపారు. ఇటీవల వేల్పనూరు పీహెచ్‌సీకి నూతన భవనం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారన్నారు. ఆసుపత్రిలో అన్నిరకాల మౌళిక వసతులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గురువారం వైద్యాధికారులు విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మార్పులు తీసుకొచ్చి, ఇకపై 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. గత నెలలో 3 కాన్పులు చేసినట్లు చెప్పారు. ఓపీ కూడా ప్రతి రోజు 80 నుంచి 100 నమోదు అవుతున్నట్లు వివరించారు. నూతన పీహెచ్‌సీలో అన్ని వసతులు ఉన్నాయని, 6 బెడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి వేళలో స్టాఫ్ నర్స్, అటెండర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని వివరించారు. పీహెచ్‌సీ పరిధిలో అబ్దుల్లాపురం, గుంతకందాల, రేగడగూడురు, వేల్పనూరు గ్రామాల ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని వేళలా అన్ని చికిత్సలు అందిస్తామని వైద్యాధికారులు చెప్పారు.

అక్రమ లే అవుట్లు తొలగింపు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా పొలంలో వేసిన అక్రమ లేఅవుట్లను గురువారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ 191/బీ, 191/సీ, 191/1ఎ, 191/1బీ సర్వే నెంబర్లలో అక్రమ లేఅవుట్లు వేశారని ఇటీవల స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో భూమి యజమాని, వెంచర్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అలాగే తొలగించాలని పలు మార్లు చెప్పినా వారు వినకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందితో లేఅవుట్లు తొలగిస్తున్నామన్నారు. ఇటీవల రుద్రవరం గ్రామ సమీపంలో జూటూరు గ్రామ పంచాయతీలో కూడా తొలగించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన అవసరం

నందికొట్కూరు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన అవసరమని ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీపీఆర్ఆర్ మెమోరియల్ ఐటీఐ కాలేజీలో విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కోసం ఇండస్ట్రీయల్ విజిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సుధాకర్‌బాబు, అయ్యపురెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ సత్యనారాయణరెడ్డి

ఆత్మకూరు: వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలను పాటించాలని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని రవాణ శాఖ కార్యాలయంలో గురువారం వివిధ పాఠశాలల బస్సుల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్‌బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని, బస్సు కండీషన్‌ను ప్రతిరోజు పరీక్షించుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం



ఎంపీడీఓ మోహన్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని ఎంపీడీఓ మోహన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆత్మకూరులో విధులు నిర్వహిస్తు బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్తున్న మోహన్ కుమార్‌ను సర్పంచ్‌లు, అధికారులు సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామి యాదవ్, సర్పంచులు శివశంకర్ నాయక్, బందెల మాబు, రవి నాయక్, ఎంఈఓ జానకీరామ్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే సీఎం జగన్ విజన్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ దారా సుధీర్
- పట్టణంలో అభివృద్ధి పనులు పరిశీలన



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజన్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. గురువారం పట్టణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి, నాడు-నేడు కింద రూపుదిద్దుకున్న బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులను దారా పరిశీలించి, వైద్య సేవలను గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో అందిస్తున్న ఇంగ్లిషు మీడియం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటారాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌టీ) ద్వారా సమగ్రంగా విజ్ఞానాన్ని సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం అందించడంపై విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్యంలో సీఎం వైఎస్ జగనన్న విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చాలా చక్కగా ఇంగ్లిషు మాట్లాడడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇంటారాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల పిల్లలను తీర్చిదిద్దుతుంటే అసత్య కథనాలను ఎల్లో మీడియా రాయడం సిగ్గు చేటన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం వైఎస్ జగనన్ననేన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగే నాయకులు, కార్యకర్తల సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు లాలు ప్రసాద్, చిన్నరాజు, కో ఆప్షన్ సభ్యులు గఫార్, విద్యా కమిటీ చైర్మన్ చక్రి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు అబుబక్కర్, జబ్బార్, ఉపేంద్రారెడ్డి, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు 2023-24 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను మొదటి, రెండు విడతల్లో గ్రామాల వారీగా బానుముక్కలకు రూ.4,35,056, చెలిమిల్లకు రూ.3,29,402, ఇస్కాల రూ.6,18,794, జూటూరు రూ.3,97,584, తుమ్మలూరు రూ.7,50,184, మద్దూరు రూ.9,74,474, మిట్టకందాల రూ.6,99,719, వానాల రూ.5,14,158, వేంపెంట రూ.9,94,800, యర్రగూడూరు రూ. 6,66,819, రుద్రవరం రూ.3,37,714, బానకచెర్ల రూ.3,95,583, పాములపాడు రూ.9,16,420, లింగాల రూ.2,89,700 చొప్పున మంజూరయ్యాయన్నారు.

తెల్లవారక ముందే పింఛన్



ముసలిమడుగు సమీపంలోని పొలాల్లో గిరిజనులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ దాసు



నంద్యాల ఆసుపత్రిలో సుంకన్నకు పింఛను ఇస్తున్న వలంటీర్ గుణవర్ధన్‌రెడ్డి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ప్రజలకు అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక ఫిబ్రవరి నెలకు సంబంధించి గురువారం ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామవలంటీర్లు తెల్లవారక ముందే ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3వేలను పంపిణీ చేస్తున్నారు. మరికొందరు గ్రామవలంటీర్లు పొలాలవద్దకు వెళ్లి మరీ లబ్ధిదారులకు నగదు అందజేశారు. మండలంలో 4,342 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజు 2,171 మందికి వలంటీర్లు పింఛన్ పంపిణీ చేశారు. దీంతో 50 శాతం పింఛన్ పంపిణీ పూర్తి అయినట్లు సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ముసలిమడుగు గ్రామ వలంటీర్ వేల్పుల దాసు గిరిజనులు నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోని పొలాల్లో పనిచేస్తుండగా అక్కడికి వెళ్లి పింఛన్ అందించాడు.

ఆత్మకూరు: పట్టణంలో 4,676 పింఛన్లకు గాను 4,210 మంది లబ్ధిదారులకు, మండలంలోని వివిధ గ్రామాలలో 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు.

పగిడ్యాల: మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలో ఆయా కేటగిరిలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు 5,023 మంది ఉన్నారు. వీరికి రూ. 1,46,85,500లు ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి రోజు సుమారు 50 శాతం పంపిణీని పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజరావు తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలం వ్యాప్తంగా 5,153 పింఛన్లు రాగా సాయంత్రం 5గంటల వరకు 3,351 మందికి అందజేసి 65.03 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. మిగిలిన పింఛన్లను శుక్రవారం సాయంత్రంలోగా పంపిణీ చేసి వంద శాతం పూర్తిచేస్తామన్నారు.

కర్నూలు వెళ్లి ఫించన్ పంపిణీ

నందికొట్కూరు రూరల్: మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన గుజ్జల చెన్నయ్య అనే వృద్ధుడు ఆరోగ్యం బాగోలేక కర్నూలులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా వలంటీర్ శ్రీనివాసులు అక్కడకే వెళ్లి పింఛన్ అందజేశారు.

మహానంది: అబ్బీపురం గ్రామానికి చెందిన పింఛను దారుడు సుంకన్న నంద్యాల పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ గుణవర్ధన్‌రెడ్డి అక్కడికి వెళ్లి పింఛను అందించారు. వెంకటలక్ష్మమ్మ నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ కల్లె బాలచంద్రుడు పింఛను అందించారు.

కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిలో 'జల్‌జీవన్' పనులు

జూపాడుబంగ్లా: కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిలో జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టనున్నట్లు జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ సమన్వయకర్త భీమశంకర్ తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నూర్జహాన్ సమక్షంలో జల్‌జీవన్ కాంట్రాక్టింగ్ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మొత్తం 11మంది సభ్యులతో గ్రామీణ జలసంఘం కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంటు, పంచాయతీ కార్యదర్శితో పాటు 9మంది డ్వాక్రా మహిళలు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఈ విద్యాసాగర్, ఏఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్స్‌కు మిడుతూరు

మిడుతూరు: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గురువారం నంద్యాలలో జరిగిన సెమీ ఫైనల్స్‌లో శ్రీశైలం నియోజకవర్గం జి.లింగాపురం సచివాలయ జట్టుపై మిడుతూరు సచివాలయ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుందని ఈఓఆర్డీ ఫకృద్దీన్ తెలిపారు. జి. లింగాపురం జట్టు 10 ఓవర్లలో 51 పరుగులు సాధించగా.. మిడుతూరు జట్టు కేవలం 5 ఓవర్లలో 52 పరుగులు సాధించి విజయభేరి మోగించింది. విజయం సాధించిన మిడుతూరు సచివాలయ జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఫైనల్స్‌లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

మహానందిలో వేలాలకు స్పందన కరువు

మహానంది: మహానంది దేవస్థానంలో గురువారం నిర్వహించిన వేలాలకు స్పందన కరువైంది. కొబ్బరి చిప్పల సేకరణ, వాహనాల పూజలు, నవగ్రహ దీపారాధన సామగ్రి విక్రయం తదితర అంశాలకు గురువారం వేలాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలాల్లో ఏపీ టూరిజం దగ్గర ఉన్న దుకాణం నిర్వహణకు నెలకు రూ. 7,000 చొప్పున చెల్లించేందుకు టెండరుదారులు ముందుకు వచ్చారు. మిగిలిన అంశాలకు నిర్వహించిన వేలాలు వాయిదా వేస్తూ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు నిర్ణయం తీసుకున్నారు.

ఓంకారంలో వేలాలు వాయిదా

బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన వేలాలు వాయిదా పడ్డాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఓంకారం ఆలయంలో పాదరక్షలు భద్రపరచుకునేందుకు, కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్‌క్రీం బండ్ల దుకాణాల నిర్వహణకు వేలాలు నిర్వహించారు. మొత్తం ఆరుగురు డిపాజిట్లు చెల్లించినప్పటికీ సరైన పాట రానందున వేలాలు వాయిదా వేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

హెల్త్ క్లినిక్ ప్రారంభం



నూతన క్లినిక్ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని కప్పల కుంట్లలో మారుఫ్ క్లినిక్‌ను వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, కో-ఆప్టేడ్ సభ్యుడు రషీద్ గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ క్లినిక్ ఆత్మకూరు పట్టణంలోని ప్రజలకే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి వచ్చే రోగులకు కేవలం రూ.50లతోనే వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందిస్తారని చెప్పారు. అంతకు మునుపు నెల్లూరుకు చెందిన మదర్సా మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్ చౌదరి, సుల్తాన్, విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిర్‌బాషా, షేక్ మహబూబ్ బాషా, డాక్టర్లు రాయుడు, వెంకటరమణ, నూర్జియా తదితరులు పాల్గొన్నారు.